# బ్రేక్



అదొక చిన్న సైజు ఆఫీసు.

ఆఫీసర్లూ, గుమాస్తాలూ, ప్యూన్లూ అంతా కలిసి సుమారుగా పదిహేనుమంది ఉంటారు.

ఆ ఆఫీసు మేనేజరు రాజారావుగారు. ఆయన గురించి తెలిసిన వాళ్ళంతా ఆయనను మంచితనానికి మరో పేరుగా అభివర్ణిస్తారు. అయితే ఆయనది అతి మంచితనమని విమర్శించే వాళ్ళూ ఉన్నారు. కాని ఒకటి మాత్రం నిజం. ఆయన ఎదురుగా ఎవ్వరూ ఆయనను పల్లెత్తు మాట అనరు. అనరేమిటి— అనలేరు.

అవకాశం వస్తే చాలు — రాజారావుగారు ఏదో పార్టీ ఇస్తారు. ఆయన హయాంలో 'పార్టీ' అనేది సర్వ సాధారణం. ప్రతి నెలా ఏదో ఒకటి ఉంటుంది.

ఆ రోజు శనివారం. రాజారావుగారు 'స్టాఫ్' అందరినీ సమావేశ పరిచారు. ఏదో పార్టీకి అది నాంది అని ఎందరికో తెలుసు. అందుకే శ్రద్ధగా వింటున్నారు.

"ఈ రోజు మీ కొక శుభ వార్త చెబుతున్నాను. మీ అందరి కృషి ఫలితంగా మన బిజినెస్ అద్భుతంగా సాగిన కారణంగా కంపెనీ వాళ్ళు నాకు 'బెస్ట్ మేనేజర్' అవార్డు ఇచ్చేరు. ఇప్పుడే టెలిగ్రామ్ వచ్చింది. సర్‌ప్రయిజింగ్‌గా చెప్పాలని ఎవ్వరికీ ముందుగా చెప్పలేదు." రాజారావుగారి స్పీచ్ పూర్తి కాకముందే అందరూ ఆయనను కంగ్రాచ్యులేట్ చేయసాగేరు. మళ్ళీ ఆయన మాట్లాడటం ప్రారంభించేరు.

"అందుకే ప్రతిసారిలా కాఫీ, టీలతో కాకుండా ఏదైనా ప్రత్యేకమైన పార్టీ ఇవ్వాలనుకుంటున్నాను. అయితే ఏ రకమైన పార్టీ ఎక్కడ కావాలనేది మీ చాయిస్‌కి వదిలిపెడుతున్నాను" అంటూ కూర్చున్నారు.

"మందూ, ఎస్వీ విందూ ఎక్కడైనా నా కొకటే." అందరికీ వినిపించేలాగే అన్నాడు చంచలరావు.

"ఐ టూ..." శ్రుతి కలిపేడు రామన్.

"మందుకి స్కైరూము, విందుకు గుల్మార్గ్ బాగుంటుంది కదూ, భయ్యా" అన్నాడు ప్రకాశరావు వర్మను చూస్తూ.

"హ్హాహ్హా ... భలే చెప్పేరు" అంటూ నవ్వేడు సూర్యవర్మ. ఏది చెప్పాలన్నా ముందు అట్టహాసంగా నవ్వడం ఆయనకు అలవాటు.

"హలో, మూర్తీ...వాటీస్ యువర్ ఐడియా?" ప్రశ్నించారు రాజారావుగారు.

"నో, సర్. నాకు ప్రిఫరెన్స్ అనేది ఎప్పుడూ ఉండదండి. ఐ యామ్ రెడీ ఫర్ ఎనీథింగ్ ఎట్ ఎనీ ప్లేస్."

మహాభాష్యం
నరసింహ శ్రీహరేష్

సత్యనారాయణమూర్తి స్పష్టం చేశాడు తన అభిప్రాయాన్ని. మాట్లాడుతున్న వాళ్ళందరి వంకా మౌనంగా చూస్తున్నాడు శ్రీనివాస్.

"మీ సంగతేమిటి?" ప్రకాశరావు శ్రీనివాస్‌ని పలకరించాడు.

"నాకైతే అప్సరా స్పెషల్ మీల్ ఇష్టం." క్లుప్తంగా చెప్పేడు శ్రీనివాస్. వరుసగా అందరూ

వారి వారి అభిప్రాయాలు చెప్పడం జరగడంతో చివరగా రాజారావుగారు మెజారిటీ అభిప్రాయాన్ని ప్రకటించేరు.

"రేపు సాయంత్రం స్కై రూమ్‌లోనే మందు ప్లన్ విందు. వెజిటేరియన్లకి కూడా అక్కడే సెప రేట్‌గా అరేంజి చేయిస్తాను." మీటింగు ముగియ డంతో అందరూ ఇంటిదారి పట్టేరు.

సూర్యవర్మ, ప్రకాశరావు, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్ అలవాటు ప్రకారం జగదాంబ జంక్షన్‌లో నిలబడి వచ్చీ పోయే వాళ్ళని చూస్తున్నారు. నారయణ రావు ( ఆఫీసు ప్యూను ) కూడా ఆఫీసు తాళాలు వేసి వచ్చి వారి ప్రక్కనే నిలబడ్డాడు.

"ఎలాగైనా మనకు భలే మేనేజరు దొరికేడు, గురూ!" నారాయణరావు కామెంట్ చేశాడు.

"మన పాత మేనేజరు పి. ఎస్. రావుకి పక్కా అపోజిట్, గురూ!" అన్నాడు ప్రకాశరావు.

"అన్నట్లు మీ రేం చేస్తారు, సూర్యవర్మా!

త్రాగడం మానేసి ఏడాది అయిందనుకొంటాను." శ్రీనివాస్ ప్రశ్న వినడంతోనే 'హహ్హాహ్హా' అని నవ్వే శాడు సూర్యవర్మ.

"ఏం చేస్తాడు? నలుగురితోపాటు నారాయణా!" అన్నాడు మూర్తి.

"అవును, నారాయణా! నీ సంగతేమిటి? నువ్వు తాగనని దేవుడి దగ్గర ప్రమాణం చేశావటకదా?" శ్రీనివాసే మరో ధర్మ సందేహాన్ని వెలిబుచ్చాడు.

"చేశాననుకోండి." బుర్ర గోక్కున్నాడు నారాయణ.

"అంటే?"

"ఏం లేదు. బీరే అంటున్నారు అందరూ. బ్రాందీ అవీ తాగను లెండి."

"వెరీగుడ్. బీరంటే నీరు ... అంతే." భుజం తట్టి అన్నాడు ప్రకాశరావు.

"భలే చెప్పావు, భయ్యా" అంటూ పెద్దగా నవ్వేశాడు సూర్యవర్మ.

"ఇంతకూ మీ విషయ మేమిటి?" మూర్తి సీరియస్‌గా అడిగాడు శ్రీనివాస్‌ని.

"నా దొకటే నిర్ణయం. నేను తాగను. నాకు తాగే వాళ్ళన్నా, తాగి వాగే వాళ్ళన్నా సరిపడదు."

"మీకు తాగని వా డెవడు తారసపడతా డీ రోజుల్లో? బి. సి. లో పుట్టవలసిన వాళ్ళు మీరు." మూర్తి ముక్తసరిగా అన్నాడు.

"అఫ్‌కోర్స్, అందుకే కనీసం నేనైనా అలా ఉందామని." శ్రీనివాస్ వైఖరి ఎవరికీ నచ్చలేదు.

"బట్ ఒన్‌థింగ్. మీకు ఇష్టం లేకపోతే తాగ కండి. కాని పార్టీకి రాకపోతే రాజారావుగారు ఫీలవుతా రేమో!"

"అయితే నా కేం? ఎవరో ఫీలవుతారని నే నెందుకు ఫీలవ్వాలి?" అని శ్రీనివాస్ అంటున్నాడో, లేదో ఎదురుగా ఎక్కడినుంచో వస్తున్న రాజారావు గారు ప్రత్యక్షమయ్యారు.

"ఏమిటీ? మీ రింకా ఇక్కడనే ఉన్నారా?" అందరూ చిరునవ్వు ముఖాలతో ఆయన వైపే తిరిగారు.

"మిస్టర్ శ్రీనివాస్! రేపు మీరుకూడా రండి. డోన్ట్ మిస్. ఇందాకే మీకు చెబుదా మనుకున్నాను. ఐ విల్ అరేంజి సెపరేట్లీ ఫర్ యు. దేర్ వోన్ట్ బి ఎనీ కంపెల్షన్. యు కెన్ హేవ్ వాట్ యు లైక్."

ఇంతలోనే ఎవరో కారులో వ్యక్తి విష్ చేయడంతో ఆయన గుడ్‌నైట్ చెప్పి వెళ్ళి పోయారు. ఆ తరవాత ఎవరికి వారే దారి పట్టారు.

• • • •

ఆదివారం సాయంత్రం ఆరున్నర కావస్తోంది. పదిహేను మంది స్టాఫ్ మెంబర్ల లోను తొమ్మిది మంది వచ్చేసరికే కళ వచ్చింది స్కై రూమ్ 'టెరేస్'కి. అక్కడ ఆ రోజు సాయంత్రం పార్టీ జరిగేది వారికిమాత్రమే. ప్రకాశరావు, మూర్తి, సూర్యవర్మ మంచి హుషారుగా మాట్లాడుకుంటు న్నారు. మౌనంగా ఉన్నా శ్రీనివాస్ వారి చర్చల్లో పాల్గొంటున్నాడు. కొంతమంది కుర్చీల్లో కూర్చుని సీరియస్‌గా ఏదో ఆలోచిస్తున్నారు. ఇంతలోనే మిగిలిన వాళ్ళుకూడా రావడంతో వేసిన కుర్చీలన్నీ నిండిపోయాయి. రాజారావుగారు లేచి ప్రారంభోప న్యాసాన్ని అందుకున్నారు.

"ఫ్రెండ్స్, ఈ రోజు నాకు చాలా ఆనందంగా ఉంది. ఐ థాంక్ యు ఆల్‌ఫర్ హేవింగ్ యాక్సెప్టెడ్ మై ఇన్విటేషన్. అన్నిటికంటె ఏ పార్టీకి సాధారణంగా రాని పానకాలరావు ఈ రోజు హాజరు కావటం చాలా ఆశ్చర్యంగాను, ఆనందంగాను ఉంది. అదిగో—బేరర్ వచ్చాడు. ఎవరి కేం కావాలో ఆర్డరు ఇవ్వండి" అని కూర్చున్నారు.

పానకాలరావు వాళ్ళ ఆఫీసులో సీనియర్ ప్యూన్. ఆఫీసు నుంచి నేరుగా ఇంటికి సాధారణంగా వెళ్ళడు. సారాయి దుకాణానికే పోతాడు. ఆయన సంపాదన సుమారుగా త్రాగుడుకే సరిపోతుంది. అతణ్ణి మార్చే ప్రయత్నాలు ఎందరో చేశారు కాని, ఎవరూ అతనిలో మార్పు తేలేక పోయారు. పానకాలరావు త్రాగుడుకి అంతటి బానిస అయ్యాడంటే కారణాలు లేకపోలేదు. దురదృష్ట దేవత ఆయనను ఎంతగావెన్నాడిందంటే, తుఫాను దగ్గర నుంచి అగ్ని ప్రమాదం వరకు ఏదీ వదలలేదు. ఫలితమే నేటి అతని దుస్స్థితి. లోగడ హార్ట్ ఎటాక్ ఎక్కువగా వచ్చినప్పుడు తాగితే చస్తా వని డాక్టరు గట్టిగా వార్నింగ్ ఇచ్చినా త్రాగుడు మానలేకపోయాడు పానకాలరావు. మామూలుగా అయితే ఏ పార్టీకి రాడు కాని, మందు పార్టీ కాబట్టి ఆ రోజు వచ్చాడు.

బేరర్ రావటంతో ఎవరికి కావలసినవి వాళ్ళు ఆర్డ రిచ్చారు. "నేను బీరుబలుణ్ణి. నా కో బాటిల్" అన్నాడు ప్రకాశరావు.

"వెరీగుడ్, భయ్యా! నేనుకూడా కొంత సేపు బీరుబలుణ్ణే" అన్నాడు సూర్యవర్మ.

"నాకు మెక్‌డొవెల్ బ్రాందీ .." ఆర్డ రిచ్చాడు చంచలరావు.

"ఐ లైక్ బుల్ ఫైటర్. గెట్ మి ఎ పెగ్ ఫస్ట్." స్టైల్‌గా చెప్పాడు రామన్.

రామన్ రాజారావుగారి ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా ట్రాన్స్ ఫర్ చేయించుకుని ఆంధ్రకు వచ్చాడు. అతనికి మందు మీద ఉన్న మోజు అంతటిది!


"హలో మురుగసామీ! హౌ అబౌట్ యు?" ప్రశ్నించారు రాజారావుగారు.


"వద్దిల్లై, సార్. నాను మానెస్తాను, సార్" అన్నాడు వచ్చీ రాని తెలుగులో.

"మానేస్తారు కదా. ప్రస్తుతానికి ఓ బీర్ వేస్కోండి" అన్నారు రాజారావుగారు నవ్వుతూ.

మొగమాట పడిపోయాడు మురుగసామి. శ్రీనివాస్‌కి ఒక థమ్స్ అప్ వచ్చింది. తాను త్రాగుతున్నది థమ్స్ అప్ అయినా ఏదో తప్పు పని చేస్తున్నట్లు ఫీలవుతున్నా డతను. అర గంట గడిచింది.

"గుడ్ నైట్...ఫ్రెండ్స్....నేనిక వెళతాను... లేకపోతే మా డాక్టర్‌గారు కన్నెర్ర జేస్తారు. ఎవరికేం కావలసినా మొగమాటం లేకుండా తెప్పించుకోండి. డోన్ట్ వర్రీ అ బౌట్ ది బిల్. సీ యు ఆల్..." అని బిల్ నిమిత్తం రామగోపాల్‌కి డబ్బులిచ్చి వెళ్ళి పోయారు రాజారావుగారు. ఆయన వెళ్ళిపోవడంతో పార్టీలో ఉన్నవారి స్వాతంత్ర్యం ఎక్కువయింది. ఏదో మూల కూర్చొన్న నారాయణరావు తాపీగా కైపులోకి జారుకొంటున్నాడు. మొదటి పెగ్గు వేసుకొంటున్నప్పుడు దేముడు, భార్య దగ్గర తాను చేసిన ప్రమాణం గుర్తుకి వచ్చింది నారాయణకి. ఒక్కసారి దేముడి కో దండం పెట్టి లాగించేశాడు. ఇక ఆ తర్వాత వాళ్ళెవరూ గుర్తుకి రాలేదు. ఇప్పు





డతనికి పాత ప్రపంచం కనిపిస్తోంది. పాత ప్రపంచం అంటే తానొకప్పుడు ఏలిన ప్రపంచం!

రాజారావుగారు వెళ్ళిన తర్వాత చర్చ లెక్కువ అయ్యేయి. ప్రతి ఇద్దరూ, ముగ్గురూ ఏవేవో మాట్లాడుకొంటున్నారు. భోజనాలకు ఒక గంట ఆలస్యమవుతుందని చెప్పేడు బేరర్. ఆర్డరిచ్చిన స్పెషల్ ఐటమ్స్ తయారీ కారణ మన్నా డతను. "ఫరవాలేదు. రెండు గంటలైనా ఆగుతాం" అన్నాడు నాలుగో రౌండ్‌లో ప్రవేశించిన నారాయణరావు.

"ఓడిపోయావా, నారాయణా? అవుటయినట్టు ఉన్నావే?"మత్తుగానే అడిగాడు సూర్యవర్మ. అతను మూడవ రౌండ్‌కే మూతి బిగించేడు.

"నే నెక్కడ అవుటవుతాను? మనం ఇంబుల్డన్ ఫైనల్ రౌండ్‌కి గవ్వాస్కర్‌లా ఎళ్ళిపోతాం."

అప్పటికి అర్థమయింది కొంత మందికి నారాయణ స్థితి. కాస్త స్పృహలో ఉన్న మూర్తి, ప్రకాశరావు అతగాడిని కంట్రోల్ చేసే ప్రయత్నాలు ప్రారంభించేరు. ఇది ఇలా ఉండగా ఎప్పుడు తీవ్ర స్థాయి చర్చలు జరిగాయో తెలియలేదు కాని, పానకాలరావు, గిరిధరరావు ఒకరి జుత్తు ఒకరు పట్టుకొని గట్టిగా తిట్టుకొంటున్నారు. వారిద్దరికి ప్రక్కన కూర్చొన్న శ్రీనివాస్ కంగారుపడి ఆమడ దూరం పరుగు తీశాడు. జనాలంతా వెళ్ళి వారిద్దరినీ విడదీశారు. పానకాలు పౌరుషం తగ్గలేదు. టేబిలుమీది గాజు గ్లాసు పగలకొట్టాడు.

"ఈడెవడు మధ్యలో నాకు జెప్పటానికి? తొమ్మిదో రౌండ్ కాకపోతే తొంభయ్యో రౌండ్ తాగుతాను. ఆపమనే హక్కు ఈడి కెవ డిచ్చాడు? నా కొడుకు—ఈడి సొమ్మా ఇది?" ఆవేశంతో వూగిపోతున్నాడు పానకాలు.

"ఏయ్...ఎవ్రడా అదీ...మందు మానమంటున్నాట్ట! నువ్వు రాజారావుగారివా చెప్పు...చెప్పు... ఇస్తాను... తీసి కొడుదువుగాని..." క్రిందికి వంగి చెప్పు తీయబోయాడు నారాయణ. "ఓరి నాయనా! నువ్వాగరా, బాబూ" అంటూ ప్రకాశరావు నారాయణను గట్టిగా పట్టుకొని సీటులో కూర్చోబెట్టేడు. చివరి దశలో ఎవరో ముగ్గురు, నలుగురు తప్ప అంతా "అవుట్ ఆఫ్ మూడ్స్"అయిపోయారు. స్పెషల్ మీల్స్ రావటంతో మాట లాపి అందరూ భోజనాలు చేయడంలో నిమగ్నులయ్యారు.

భోజనా లయిపోయాయి. సడెన్‌గా నారాయణ లేచి "ఇన్‌క్విలాబ్ జిందాబాద్" అని బిగ్గరగా అరిచాడు. చాలా మందికి అర్థం కాలేదు. "తప్పురా, నాయనా...నారాయణా...అలా అరవకూడదు. రాజారావ్‌జీ జిందాబాద్ అనాలి." పానకాలరావు మూతి తుడుచుకొంటూ మృదువుగా అన్నాడు.

"అయిపోయింది,బాబులూ...అందరూ దిగండి... బిల్ చెల్లించేను." అనౌన్స్ చేశాడు రామగోపాల్ తన కప్పజెప్పిన బాధ్యతను పూర్తిచేసి.

మెల్లిగా అడుగులో అడుగు లేసుకొంటూ ఒక్కొక్కరూ క్రిందికి దిగేరు. ఎవరికి ఎవరూ తోడు వెళ్ళే స్థితిలో లేనందువల్ల ఎవరి దారి వారే చూసుకోవలసి వచ్చింది.

* * * *

నూతిలో ఏదో పడినట్లు శబ్దం రావటంతో కంగారుపడి నుయ్యి దగ్గరకు పరుగు పెట్టింది నారాయణ భార్య. ఆ వెనుకనే పరుగెత్తాడు నారాయణ తండ్రి. "ఓరి నాయనో" అంటూ ఆవిడ రాగాలాపన ఆరంభించింది.

"ఏమయిందే ... ఎందుకేడుస్తావ్?" ఎక్కడి నుంచో నారాయణ గొంతు వినిపించింది. ఉలిక్కిపడి చూశా రిద్దరూ.

అక్కడ ఉన్న బురదగుంటలో కూలబడి ఉన్నాడు నారాయణ. పీక వరకూ మురికి నీళ్ళు!

"ఓరి గుడ్డి నా కొడకా! కళ్ళేమయినాయిరా?" తండ్రికి ఒళ్ళు మండింది.

"ఇదేం ఘోరమయ్యా?...అందులోపడిపోనావ్?" నారాయణ భార్య అందుకొంది.

"బాగుంది లేయే! మజాగా ఉంది. ఫైనల్స్‌కి వచ్చినట్టుంది!"

"ఓరి నీ జిమ్మడ! తాగావేమిట్రా దరిద్ర నారాయణా!నీకేంపోయేకాలంరా!"బురదలోంచి బయటకు లాగుతూ చిరాకు పడ్డాడు నారాయణ తండ్రి.

"ఓరి నాయనోయ్...నా మొగుడికి కిట్టని వాడెవడో మందు పట్టేశాడు...ఆడి..."

"తిట్టకే, లంజదానా. మహానుభావులను తిడితె మందుకూడా కరువై పోతుంది. అయినా నా కిప్పు డేమైందని? సుకంగా ... మందు మహా సముద్రంలో ఈత కొడుతున్నాను."

నారాయణను మెల్లిగా బయటకు లాగేరు అతని భార్యా, తండ్రీ.

"అమ్మో ... నా కాలు ... నా కాలు..." అకస్మికంగా అరవడం ప్రారంభించేడు నారాయణ.

"కాలూ లేదు, చెయ్యీ లేదు. పద, ఇంట్లోకి పందికొక్కు ఎదవా" అన్నాడు తండ్రి.

"ఓరి నాయనోయ్. నా కాలురా, నాయనా. కాలు విరిగిందిరా, బాబూ. ఒసి, గౌరీ, నా కాలు విరిగిందే. నొప్పి చంపేస్తోందో, రాక్షసీ ..."

"ఏం? ఆ ఎదవ తాగుడు జోలికి పోకపోయావా? కాలు పోయిందట కాలు. ఆ నోరుకూడా పోయుంటే ఈ ఏడుపు బాధ కూడా తప్పిపోయేది!" విసుక్కుంది నారాయణ భార్య.

"ఏమిటే ఇది? కాలు పోయిందని గోలెడుతుంటే శాపనార్థాలు పెడతావేంటి?"

"ఆ బుద్ధి ముందుండాల—మందు సూడగానే మతి పోయిందా ఏటి? సిగ్గులేకపోతే సరి. దేవుడి ముందు నా నెత్తిన సెయ్యెట్టి సేసేవు కదా ప్రెమాణికం. అందుకే ఆ కాలు కీలు జారిపోయింది."

"ఓలమ్మో! నొప్పి. నేనేటి చేశానే? పెద్దాయన తాగమని చెబితే తాగేను. అయినా అంత పోస్తారని నాకేటి తెలుసే?"

"ఎలా తెలుస్తాదిరా? రెండు కాళ్ళూ పోయుంటే తెలిసొచ్చేది. ఎంత తాగేవ్రా!" చీదరించుకొన్నాడు నారాయణ తండ్రి.

"అమ్మో ... అయ్యో ... నొప్పి!" రాగాలు ఆపలేదు నారాయణ.

"ఏడవకురా, నాయనా. కుక్కిన పేనులా ఆ మూల తొంగో. లోపలికొస్తే ఆ కంపు మేము భరించలేం. రేపు డాక్టరొచ్చి ఆ రెండో కాలుకూడా తీసేస్తాడు. అప్పటికి గాని కుదర్దు రోగం."

* * * *

సోమవారం.ఉదయం పదికావస్తోంది. మామూలు రోజుల్లో ఆ సమయానికే అందరూ వచ్చేస్తారు ఆఫీసుకి. కాని ఆ రోజు అప్పటికి ఆరుగురుమాత్రమే వచ్చేరు. రాజారావుగారు కూడా రాలేదు ఏ కారణంచేతనో?

"సీ ... మందు పార్టీ ఈజ్ బేడ్ యార్ ... నాన్ వద్దిల్లె అన్నా నాకు బీరు పోస్తిరి. నెక్స్ట్ ఎ రౌండ్ల ఏది సిప్ చేసుంటినో నాకె తెరియాదు. ఏమైన హి షుడ్ నాట్ హేవ్ అఫర్డ్ ఎ డ్రింక్ పార్టీ!" మురుగసామి అభిప్రాయం వ్యక్తంచేశాడు.

ఇంతలో పరుగెడుతున్నట్లు నడుస్తూ వచ్చాడు త్రినాథరావు. "సార్ ... మన పానకాలుకి తెల్లారుజామున హార్ట్ ఎటాక్ వచ్చిందట. కె.జి.హెచ్.లో జాయిన్ చేశారు." కంగారుగా చెప్పేశాడు.

"ఈజిట్!" ఆశ్చర్యం ప్రకటించేడు మురుగసామి. "రాత్రి అంతగా తాగినట్లు లేడే!" ప్రకాశరావు

సందేహం వెలిబుచ్చేడు. "ఎందుకు తాగలేదూ? తొమ్మిది రౌండ్లయినా వేసే ఉంటాడు" వర్మ చెప్పేడు.

"తాగేటప్పుడు కొంచెం లిమిట్‌లో ఉండాలి." మూర్తి నెమ్మదిగా అన్నాడు.

"చూడు, బాబూ. తాగిన తర్వాత లిమిట్ చూసుకొనే వారు నూటికో, కోటికో ఒక రుంటారు. నన్నడిగితే ఇలాంటివి అరేంజి చేయడమే తప్పు. డబ్బుల్లేక అతను రోజూ కొంచెమే తాగుతున్నాడు. కూర్చోబెట్టి 'తాగు, నాయనా' అంటే సీసాలకు సీసాలు తాగడూ మరి ..." శ్రీనివాస్ కొంచెం ఆవేశంతోనే సమాధానం చెప్పేడు.

అంతలో రాజారావుగారు వచ్చి తన కేబిన్‌లోకి వెళ్ళిపోయారు. అంతా సీరియస్‌గా ఉన్నారు. ఆ వెనకనే వచ్చాడు నారాయణ తమ్ముడు. "ఏమిటి, బాబూ?" శ్రీనాథరావు అడిగేడు.

"లీవు లెటరు. మా అన్నకు రాత్రి కాలు విరిగింది. ఆస్పత్రిలో జాయిన్ చేశారు" అంటూ ఏడవడం ప్రారంభించేడు.

"ఫర్వాలేదులే. నువ్వెళ్ళు. ఏడవకు.తగ్గిపోతుంది." అతి కష్టం మీద నారాయణ తమ్ముణ్ణి బయటకు పంపించేడు శ్రీనాథరావు.

రాజారావుగారు ఏదో పనిమీద బయటకువచ్చారు. "ఏమిటండీ—ఇవాళ చాలా తక్కువ మంది కనిపిస్తున్నారు?" అమాయకంగా అడిగారు.

"ఏముంది, సార్? మందు పార్టీ మహిమ!" తక్కువ జవాబిచ్చేడు చంచలరావు.

"ఎలాగైనా ఇలాంటి పార్టీలు లాభంలేదు,సార్." బుర్ర గోక్కుంటూ అన్నాడు అసిస్టెంట్ మేనేజర్ రామన్, తక్కువ మందితో ఆఫీస్ ఎలా మానేజ్ చేయాలో తెలియక.

రాజారావుగారి ముఖ కవళికలు మారిపోయాయి. ఆయన కర్థం కాలేదు వాళ్ళ అసలు భావాలు. మొన్నటి రోజు మీటింగులో వాళ్ళే రకరకాల సలహాలు ఇచ్చారు. మరి ఇప్పు డింకొకలా మాట్లాడుతున్నారు.

అందరి ముఖాలూ అదోలా కనిపించినా, శ్రీనివాస్ ముఖంలో మాత్రం సంతృప్తి లాంటిది తళుక్కుమంది. అర్థం కోల్పోతున్న మంచితనానికి, అవధులు దాటుతున్న అవకాశ వాదానికి ఆ క్షణాలైనా బ్రేకులు వేస్తాయని అతని ఆశ! *

# వారఫలాలు

**14-4-82 నుండి 20-4-82 వరకు**

## మేషం

మీకు సంబంధించినంతవరకు గృహ విషయాలకుగాని, స్థిరాస్తి సంబంధ వ్యవహారాలకు గాని ఈ వారం ఉత్తమ కాలంగా ఉంటుంది. భారీ ఎత్తున ధన వ్యయం చేయుట మీ సంకల్పం. విలువగల వస్తు సేకరణకుగాని, వ్యాపార విస్తరణకుగాని, కట్టుబడి మొదలగు శాశ్వత నిర్మాణములకు గాని ధన వ్యయం చేయ సంకల్పించుతారు. ఇందుకు వలసిన ధనం ఋణ రూపంగా మీకు శ్రమలేక లభింపనున్నది.

## వృషభం

ఈ వారం అంతా పెట్టుబడి వ్యాపారానికి, గాని స్థిరాస్తి క్రయ విక్రయాదులకు గాని అనుకూలంగాను, లాభదాయకంగాను ఉంటుంది. అయినా ఆర్థిక సంబంధ విషయాలలో మీరు జాగ్రత్తగా, నిర్మొహమాటంగా వ్యవహరించాలి. అందులో ఇతరుల మనస్సు బాధపడకుండా సంభాషించుట అనేది మీకు వెన్నెతో పెట్టిన విద్య గన దానిని సంపూర్తిగా వాడుకొనుట క్షేమదాయకం. వారారంభ దినాలు శుభప్రదాలు.

## మిథునం

మీరు స్పెక్యులేషన్ విషయం ఈ కాలంలో ఆలోచించను కూడా ఆలోచించరాదు. అట్లుగాక అందులో దిగితే బహు నష్టాలకు గురి కాక తప్పదు. వ్యయం కూడా కొంత అధికంగా చేయాలనే ఉత్సాహం కలుగుతుంది. ఇది ఇతరుల నుండి గౌరవ మర్యాదలు పొందుటకు సులభ సాధనం అని భావిస్తారు. మీ భావన కొంతవరకు యథార్థమైనా, మీ సొమ్ము తిని గౌరవించే వారు మీ శ్రేయోభిలాషులు కారు.

## కర్కాటకం

మీ ఆప్త మిత్ర బంధు కోటిలోని వారి వ్యవహారాలలో మీరు ప్రయోజనం ఆశించకుండానే ప్రమేయం కలగ చేసుకొంటారు.అవసరానికి కొంతద్రవ్యం కూడా అనాలోచితంగా వారి కొరకై వ్యయం చేస్తారు. భావి కాలంలో ఇందు వలన చిక్కులు తప్పవు. మీరు కావించిన మంచికి కృతజ్ఞత లేకపోగా మీరు పునః తిరస్కరించినప్పుడు మిమ్ములను దూషింపగలరని గుర్తెరిగి వ్యవహరించండి.

## సింహం

ఈ వారం నుండి ఈ రాసి వారికి ఉన్నత విద్యకు, రిసెర్చి కార్యకలాపాలకు, సాహిత్య రంగమందు కీర్తి నొందుటకు అనుకూలప్రదంగా ఉంటుంది. దూరపు ప్రయాణాలుగాని, తీర్థయాత్రలు గావించుటకు గాని తీవ్రత జనిస్తుంది. దైవ సంబంధ కార్యాలపై అభిమానం అధికమువుతుంది. పండితులపై గౌరవం, పురాణ శ్రవణాది కార్యాలయందు ఆసక్తి క్రమక్రమంగా వృద్ధినొంద నున్నవి.

## కన్య

ఈ వారంలో మీ పై శుక్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. ధన భాగ్యాధిపతి అనుకూలుడై ఉండగా ఎలాటి ఇబ్బందులు ఆర్థిక రంగంలో ప్రాప్తించవు. గాని కామోద్రిక్తత మిమ్ములను పెడత్రోవ పట్టించే అవకాశాలు అధికంగా ఉండనున్నవి. ఈ విషయంలో పురుషుల కన్న మధ్య వయస్కులగు స్త్రీలు జాగ్రత్త వహించాలి. భ్రమా ప్రేరితమగు ఆకర్షణలకు వశం కారాదు.

## తుల

నీతి నియమాలను పాటించే వారు క్లిష్ట పరిస్థితుల నెదుర్కొనవలసి ఉంటుంది. మీ అభిప్రాయాలను ఇతరులకు వివరించుట వలన మీ కష్టాలు ఇనుమడింప నున్నవి. కాలానుగుణంగా మనుష్యుల మనస్తత్వాలను గుర్తెరిగి వ్యవహరించండి. ధనికులుగాని, ఉన్నతాధికారులు గాని అయినంతమాత్రాన వారు నీతిమంతులూ అను భావం వివారణీయం.

## వృశ్చికం

స్త్రీల ఆకర్షణకు వశులు కానివారు సృష్టిలో బహు అరుదుగా ఉంటారని ఎల్లరూ ఎరిగిన విషయమే. ఈ ఆకర్షణలు సర్వసామాన్యంగా కష్ట పరంపరలకు దోహద మగుత వంటారు అనుభవజ్ఞులు. మీ విషయంలో ఇది అన్యథా రూపొందదు. మీరు ఎంతటి నిగూఢ వర్తనులైనా మీ విషయం ఎప్పుడో ఒకప్పుడు బహిర్గతం కాక తప్పదు. రంకు, బొంకు దాగేవి కావు.

## ధనుస్సు

మీకు తీవ్రమైన దైవారాధన భావాలు జనించే కాలంగా ఉంది. ఇవి ఆచరణలో ఎంత వరకు క్రియారూపం పొందగలవనేది విచారణీయం. స్నిమితమైన, దృఢమైన చిత్తం కల వారు మాత్రం ఇందలి సత్ఫలితాలను పొందుతారు. ఎక్కువ మంది ఆరంభశూరులు గానే మిగిలిపోతారు. కొంచెం ఉదారత కూడా అలవరుచుకోండి. ఆలోచనలవలన ప్రయోజనం శూన్యం.

## మకరం

తంత్రవిద్యలో మీకు మీరే సాటి. ఏదో ఒక మార్పు జరిపించుట, దానివలన ఇతరులు బాధలకు గురికాకుండా మీరు వారిని పరామర్శింపకపోగా వృథా ఆశలను కలిగించి మీ చుట్టూ త్రిప్పుకొనే ప్రయత్నాలు మీకు ఆనందదాయకాలు. అంతే ఈ రాసివా రందరూ ఇలాంటి వారు కాదు. శని ఈ రాసిని వీక్షించుచున్నవారికి మాత్రం ఈ విషయం పూర్తిగా వర్తిస్తుంది.

## కుంభం

మీలో కొందరు రిక్త కుంభాలు, కొందరు పూర్ణ కుంభాలుగా ఉండుటలో విశేషం ఏమీ లేదు. పరమాత్మ సృష్టి ఏకరీతిగా ఉండదు. భిన్న స్థాయీలు ప్రతి రంగంలోను గోచరించుచుండ గలవు కదా. శతభిషా నక్షత్ర జాతకులకు ఇతరులకన్నా అధికంగా శుభఫల ప్రాప్తి కాలంగా ఉంటుంది. కాని గోచారరీత్యా గురువు వృశ్చిక ప్రవేశం కావించుట మీరు గమనించి జాగ్రత్త పడాలి.

## మీనం

మీకు రాబోవు కాలం పరీక్షా కాలంగా ఉంటుంది. బహుముఖంగా అవరోధాల నెదుర్కొన వలసి ఉంటుంది. ఆదాయం కన్న వ్యయం అధికం అవుతుంది. మీరు ఏవో భావాలు కలిగి, వూహా ప్రధానంగా కావించే కార్యాలలో చిక్కులు తప్పవు. మీ ప్రేమపాత్రులైన బంధుమిత్రుల వలన గాని, సంతాన మూలకంగా గాని మానసిక అశాంతికి గురి కానున్నారు.

– దివాకరుని వెంకట సుబ్బారావు